—యమ్. జయశ్రీ

# సైడ్ ట్రాక్

## డోంట్— కమిట్

"నీ కోసం నా ప్రాణం ఇస్తాను"

"డోంట్ గివ్ ద స్టేట్‌మెంట్...!"

"అయామ్ నాట్ ఫూల్— టు గివ్ ద స్టేట్‌మెంట్— ఇట్స్—ఎ— కమిట్‌మెంట్" స్థిరంగా అన్నాడు.

"థాంక్యూ... డార్లింగ్... నా కోసం ప్రాణం వద్దుగానీ... నీ ప్రేమ నివ్వుచాలు"

కళ్ళలో కళ్ళుపెట్టి చేతిలో చెయ్యేసి అడిగింది అనూరాధ.

"నేను నిజంగా చాలా అదృష్టవంతుడ్ని" మనస్ఫూర్తిగా అన్నాడు వేణు.

"అవునూ అదృష్టం అంతా



నీదేనా... అదృష్టం కూడా చెరిసగం పంచు"

"అనూ... నువ్వు చాలా చక్కగా మాట్లాడగలవ్. నీకున్న మంచిగుణాల్లో ఇదొకటి"

...కొన్ని చెడ్డగుణాలున్నాయన్న మాటే గదా... చిరుకోపంగా అడిగింది.

గభాల్న నోరుజారినందుకు నాలుక కొరుక్కున్నాడు వేణు.

"సారీ... డియర్... చెడ్డగుణం అంటే తొందరగా కోపం రావడం... ఇలాంటి చిన్నచిన్న నన్నమాట.." సర్దిచెప్పబోయాడు. అనూరాధకి కోపం మరింత ఎక్కువైంది.

"ఇంకోసారి రిపీట్ చేశావంటే...? తర్జనగా అంది బెదిరిస్తున్నట్టుగా మొఖంపెట్టి. వేణుకి తన మీద తనకే కోపం వచ్చింది. ఎప్పుడూ అంతే! ఒకటి చెప్పబోయి మరోటి అని అనూరాధకి కోపం తెప్పిస్తాడు. చాలాసేపు బ్రతిమిలాడి బ్రతిమిలాడి ఆమెను ప్రసన్నురాలిని చేసుకొన్నాడు.

కోపంపోగానే ఇద్దరూ కలిసి మినర్వాలో పిక్చర్‌కెళ్ళారు. ఆ తర్వాత క్వాలిటీలో డిన్నర్ తీసుకొన్నారు.

స్వీట్‌కిస్‌తో గుడ్‌నైట్ చెప్పింది అనూరాధ... అలాంటి స్వీట్ కిస్‌లు చాలా అందుకున్నాడు వేణు చాలా సాయంత్రాలు.

* * *

హఠాత్తుగా వేణుకి ట్రాన్స్‌ఫర్ అయింది. ఎవరూ ఊహించలేదు కూడాను... అందరూ అనూరాధను జాలిగా చూశారు. వారి ప్రేమ సంగతి అందరూ అప్పటికే పసిగట్టారు. ఒకవారం తర్వాత సరోజ డైరెక్టుగా అనూరాధను అడిగేసింది.

"ఏమోయ్ అనూరాధా... మీ వేణు ట్రాన్స్‌ఫర్ అయివెళ్లాడు... పాపం నువ్వు చాలా దిగులుపడుతున్నావ్ గదూ! పైగా మీరిద్దరూ త్వరలో పెళ్ళి కూడా చేసుకోవాలనుకొన్నారేమో...!" అంది.

ఆ మాటలకి అనూరాధ పగలబడి నవ్వి—

"పూర్ సరోజా... వేణుకి ట్రాన్స్‌ఫర్ అవగానే గుడికెళ్ళి డజన్ కొబ్బరికాయలు కొట్టాను. ఇంకా నాకు ప్రేమించే వయసు బోల్డంత వుంది. ఇప్పుడే కమిట్ అయి నన్ను నేను పెళ్ళితో బంధించుకోను" అని చాలా ఫ్రాంక్‌గా చెప్పింది.

తెల్లబోయింది సరోజ.

*